ప్రజాశక్తి
సోమవారం 17 మార్చి 2025
5
కర్నూలు



అలా వచ్చి.. ఇలా వెళ్లారు...

- జడ్పీ సర్వసభ్య సమావేశం మధ్యలోనే వెళ్లిపోయిన మంత్రి, ఎమ్మెల్యేలు
- సమస్యలు పట్టవా అంటూ జడ్పిటిసిల ఆగ్రహం
- తాగునీటిపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ అంశాలపై చర్చించారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ సమావేశానికి వచ్చి మధ్యలోనే వెళ్లారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎంపీ బస్తిపాటి నాగరాజు, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కూడా సమావేశం మధ్యలో అలా వచ్చి ఇలా వెళ్లారు. అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు కనీసం ప్రజా సమస్యలపై చర్చించి జిల్లా అభివృద్ధికి దోహదపడం మానేసి ఇలా వెళ్లడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. అధికారపార్టీకి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అవసరం లేదా? ప్రజా సమస్యలు పట్టవా? కనీసం వినే ఓపిక తీరిక లేకుండా ఉందని పలువురు ఎమ్మెల్యేలు, జడ్పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ప్రజా సమస్యలు పట్టవా ? కనీసం సమయాన్ని ఇవ్వకుంటే ఎలా.. సమస్యలు ఎవరు వినాలి అని ఆగ్రహించారు. వారికి సమయం ఉన్నప్పుడే సమావేశం పెట్టాలని కొత్తపల్లి జడ్పిటిసి ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ పాపిరెడ్డి సముదాయిస్తూ ఇద్దరు జిల్లా కలెక్టర్లు ఉన్నారని వారికి సమస్యలు విన్నవించాలని తెలిపారు. అసెంబ్లీలో కలెక్టర్లు కాదు..మాట్లాడేది ఎమ్మెల్యేలు, మంత్రులు..వారే ఈ సమస్యలు వినకుంటే ఎలా అని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- మంత్రి టిజి భరత్

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ అధికారులను ఆదేశించారు. ఓవర్ హెడ్ వాటర్ స్టోరేజ్ ట్యాంకుల సామర్థ్యాన్ని తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు.

కందులను ఆదోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్‌కు తీసుకెళ్లిన తర్వాత రైతులను వెనక్కు పంపిస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే చెప్పగా గోడౌన్‌కు రాకముందే నాణ్యతను చెక్ చేసే అంశాన్ని పరిశీలించాలని మార్క్ ఫెడ్ డిఎమ్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు.

జొన్నగిరి గ్రామంలో చేపల చెరువులో నీరు కలుషితమై చేపలన్నీ చనిపోయాయని తుగ్గలి జడ్పిటిసి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అక్కడికి వెళ్లి పరిశీలించి, చెరువు నీటి శాంపిల్‌ను చెక్ చేయించాలని కలెక్టర్ మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. హంద్రీనీవా ద్వారా జిల్లాలో ఉన్న చెరువులను మార్చి నాటికి 90 పైగా శాతం నీరు నింపే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, 4, 5 చెరువులు మాత్రం మిగిలి పోయాయని, వాటిని కూడా త్వరలో నింపుతామని తెలిపారు. నంద్యాల జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ రాజకుమారి గణియా స్పష్టం చేశారు. గోరుకల్లు, అవుకు, వెలుగోడు రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపి, గండికోట రిజర్వాయరుకు కూడా నీటిని పంపామని తెలిపారు. వెల్దుర్తిలో షాది ఖానా లేక ముస్లింలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆ మండల జడ్పిటిసి ప్రస్తావించారు.

పలు గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యను తీర్చాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. ఆలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో తీవ్రమైన నీటి సమస్య ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విరూపాక్షి కోరారు. నీటి సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ నుండి ఏ మండలానికి ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో వివరాలు తెలపాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య కోరారు. జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి సమాధానమిస్తూ ఉమ్మడి జిల్లాకు రెండు కోట్లు నిధులు ఉన్నాయని, ఒక్కో జిల్లాకు కోటి చొప్పున ఇస్తున్నామని తెలిపారు. ఆదోని, కౌతాళం, కోసిగి మండలాల్లో తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సమస్యలను పరిష్కరించాలని కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప కోరారు. మిర్చికి మద్దతు ధర ఇచ్చి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కర్నూలు జెసి డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సిఇఒ నాసర రెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి : జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి



జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ తాగు నీటి సరఫరా, వ్యవసాయ శాఖ, జల వనరుల శాఖ, అంశాలపై సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీటి సమస్యను తీర్చడానికి గ్రామపంచాయతీ నిధులను వినియోగించుకోవాలని, అవి సరిపోకపోతే, మండల పరిషత్ నిధులను కూడా వినియోగించు కోవాలన్నారు. అవి కూడా సరిపోనట్లయితే జిల్లా పరిషత్ నుండి సాధ్యమైనంత వరకు నిధులను సమకూర్చుతామని తెలిపారు. ఇంతకు మించిన సమస్యలు ఉంటే మంత్రుల ద్వారా కానీ కలెక్టర్ ద్వారా గాని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఖరీఫ్‌లో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కృష్ణా నీటిని సమర్ధవంతంగా వినియోగించుకునేందుకు గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మించు కోవలసిన అవసరం ఉందన్నారు.

గత సమావేశం ప్రస్తావించినా చర్యలు లేవు : ఎంపీ బస్తిపాటి నాగరాజు



పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఉందని గత సమావేశంలో ప్రస్తావించానని, తగిన చర్యలు లేవని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లో నీటి సమస్య తీర్చడం కోసం ఎంపీ ఫండ్స్ నుండి రూ.60 కోట్లు ఇచ్చామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి గాజులదిన్నెకు మూడు టీఎంసీల నీటి కేటాయింపు ఉందని, అక్కడ పైప్ లైన్ ఏర్పాటుచేస్తే ఆ ప్రాంతంలో తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్న హట్టేకల్, పుప్పాల దొడ్డి, బిల్లేకల్లు గ్రామాలకు నీటి సమస్య తీరుతుందన్నారు. గాజులదిన్నె నుండి డోన్ కు 82 కోట్లు ఖర్చు చేసి నీరు తీసుకెళ్లారు కానీ కోడుమూరుకు నీటి సమస్య తీరడం లేదని, కోడుమూరుకు శాశ్వతంగా నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

వసతి గృహాల్లో సౌకర్యాల కల్పన

- పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్
- ప్రతివారం సబ్జెక్టుల వారీగా పరీక్షలు
- ప్రజాశక్తితో సాంఘిక సంక్షేమ శాఖ జెడి జె.రంగలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే తమ లక్ష్యమని కర్నూలు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మి తెలిపారు. వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్, ప్రతి వారం సబ్జెక్టుల వారీఆగ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జెడి : పదో తరగతి పరీక్షలకు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల నుంచి సుమారు 500 మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. వారి రోజువారి దినచర్యలోనూ ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తున్నాం. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సకాలంలో అందజేస్తున్నాం.

విద్యార్థులకు అకాడమిక్ చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా?

జెడి : విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో అకడమిక్ సైడ్ ప్రత్యేక దృష్టి సారించాం. అందులో భాగంగా విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకున్న పాఠ్యాంశాలను హాస్టల్లో మరో మారు వాటిని రివిజన్ చేసేలా ప్రత్యేక స్టడీ అవర్స్‌ను ఉదయం ఐదు గంటలు నుండి 7:30 గంటల వరకు, సాయంత్రం ఏడు నుంచి పది గంటల వరకు నిర్వహించాం. మోడల్ పేపర్లను, ముఖ్యమైన ప్రశ్నలను గుర్తించి వాటిని తప్పనిసరిగా నేర్చుకునేలా విద్యార్థులకు రివిజన్ చేశాం. హాస్టల్లో ట్యూటర్ల ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయిస్తున్నాం. ప్రతివారం రెండు సబ్జెక్టుల చొప్పున వారాంతపు టెస్టులను నిర్వహించాం.

విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా ఏవైనా కార్యక్రమాలు చేపడుతున్నారా?

జెడి : విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించాలనే సంకల్పాన్ని బలపరిచేలా కొంత మంది స్ఫూర్తి కలిగిన ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక మోటివేషన్ క్లాసులను బోధిస్తున్నాం. అంతేకాకుండా పరీక్షల్లో వ్యవహరించాల్సిన మెలకువలను గురించి కూడా తెలియజేస్తున్నాం. తద్వారా విద్యార్థులకు పరీక్షల భయం తొలగిపోవడమే కాకుండా ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

హాస్టళ్లలో కిందిస్థాయి అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది?

జెడి : ఇప్పటికే ఎఎస్‌డబ్ల్యూఓలు, హెచ్ డబ్ల్యుఓలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాము. నిరంతరం హాస్టల్‌ను పర్యవేక్షించాలని ఆదేశించాం. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను సాధించడం కోసం అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. హాస్టల్లో చేపడుతున్న రోజువారి రిపోర్టులను సేకరించి సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు నివేదిస్తున్నాం.

విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన సామాగ్రిని ఏమైనా సమకూరుస్తున్నారా?

జెడి : పరీక్షలు రాసేందుకు ఉపయోగపడేలా పరీక్షల ప్యాడ్, జామెంట్రీ బాక్స్, పెన్ను, పెన్సిల్, స్కేలు, రబ్బరును విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నాం.

వసతి గృహాలలో ఏవైనా సమస్యలు గుర్తించారా? ఉంటే వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జెడి : వసతి గృహాల్లో ఇప్పటికే పలు సమస్యలను గుర్తించాం. మేజర్ మైనర్ రిపేర్ వర్క్‌లను కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయా ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో వారిగా పనులను అప్పగించాం. అందులో ప్రధానంగా రూఫ్ లీకేజీ ఫ్లోరింగ్ అదనపు గదుల నిర్మాణం ప్యాచ్ వర్కులు, తలుపులు, కిటికీలు, మెష్‌ల ఏర్పాటు కంటి పనులు చేపడుతున్నాం.



పొట్టి శ్రీరాములుకు భారతరత్న కోసం కృషి

జయంతి సభలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అమరజీవి పొట్టిశ్రీరాములుకు భారత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంతో తనవంతు కృషి చేస్తానని పరిశ్రమలు, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కర్నూలు నగరంలోని చిల్డ్రన్స్ పార్క్‌వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి టిజి. భరత్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ కార్పొరేటర్లు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజలందరూ నిత్యం స్మరించుకోదగిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. తెలుగు ప్రజలంతా కలిసి ఉండాలని ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు జీవితం త్యాగం చేశారన్నారు. నేటి యువత పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర తెలుసుకోవాలన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



నివాళ్లులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- 172 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న 40,776 మంది విద్యార్థులు
- నేటి నుంచి పది పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా ఈసారి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షా నిర్వహణను పర్యవేక్షిస్తారు. ఈనెల 17 నుండి 31వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ఈ పరీక్షలను 40,076 మంది విద్యార్థులు రాయనున్నారు. జిల్లాలో 172 పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎనిమిది సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ సీసీ కెమెరాలు ద్వారా పర్యవేక్షణ చేస్తారు. ఈ పరీక్షల నిర్వహణకు 172 మంది చీఫ్ సూపర్డెంట్లు, 172 మంది డిపార్ట్మెంట్ ఆఫీసర్లను నియమించారు. 1884 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ కూడా అమలు చేయనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఫ్లైయింగ్ మరియు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద పరీక్ష రాసేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డెస్కులను ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధికారులకు శిక్షణ కార్యక్రమం కూడా విద్యాశాఖ పూర్తి చేసింది. టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సదుపాయ సౌకర్యాన్ని కూడా కల్పించారు. విద్యార్థులు హాల్ టికెట్లు చూపిస్తే బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ : ఎస్.శామ్యూల్ పాల్, డీఈవో

జిల్లాలో టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను కల్పించాం. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలను రాయాలి.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ

24న రవాణారంగ కార్మికుల ఛలో ఢిల్లీ

- జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రవాణా రంగ కార్మికులైన ఆటో, లారీ ఇతర రంగాల కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రవాణా రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రవాణా రంగ కార్మికుల పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్యుల సమావేశం ఆటో యూనియన్ సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు దివాకర్ మాట్లాడుతూ ఈ దేశంలో సరుకు, ప్రజా రవాణా ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు సమకూర్చే రవాణా రంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిపోయిందన్నారు. చాలీచాలని ఆదాయంతో వారి కుటుంబాలను పోషించుకుంటున్న డ్రైవర్ల జీవితాలు మరీ దుర్భరంగా తయారయ్యాయన్నారు. చిన్నచిన్న ఓనర్లు ప్రభుత్వ విధానాల వల్ల డ్రైవర్ల మారే పరిస్థితి ఏర్పడిందని, డ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్న ప్రభుత్వాలు వివిధ జీవోలు భయంకరమైన సెక్షన్ల ద్వారా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వాహనాల ఎఫ్సీలను ప్రైవేటీకరిస్తూ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే విధానాన్ని ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రవాణా కార్మికులు ఇప్పటికైనా మేలుకోకపోతే ప్రమాదాలు పొంచి ఉన్నాయని రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోతుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలపై పోరాటాలు చేయడమే ఏకైక మార్గమని ఈనెల24న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రవాణా రంగ కార్మికులు పాల్గొనాలన్నారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు పి.మహమ్మద్, ఎస్.హుస్సేన్‌వలి, నగర నాయకులు నబీ ,మళ్లీ ,వెంకట్, మధు పెద్ద కరుణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి

- సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో చెత్తను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్ డిమాండ్ చేశారు. జోహరాపురంలో 18 వ వార్డులో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రంగస్వామి అధ్యక్షతన ప్రజాచైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శివర్గ సభ్యులు విజయరామాంజనేయులు మాట్లాడారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లాప్ ఆటోలు ఉండటం వలన ఇంటింటి దగ్గర నుండి చెత్త సేకరించడం కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేవారని, మున్సిపల్ కార్పొరేషన్ పాలక పక్షం రాష్ట్ర ప్రభుత్వం సరిగా పట్టించుకోకపోవడం వలన రెడ్డి ఏజెన్సీ వారు ఫైనాన్సర్లకు అప్పు చెల్లించకపోవడం వలన ఆటోలు జప్తు చేసుకొని తీసుకెళ్లడంతో కర్నూల్ నగరం చెత్త మయంగా మారిందన్నారు. నగర ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం వారు మున్సిపల్ పాలకపక్షం నగరంలో చెత్త సేకరించ డానికి వంద ఆటోలు కొనుగోలు చేసి క్లాప్ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో నగర ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు మైమూద్, నాగరాజు, దాస్, కృష్ణ, తిప్పన్న, మధు, మౌలాలి, రామాంజనేయులు, విశ్వనాథం, రాజు, ప్రవీణ్, మద్దయ్య , కార్యకర్తలు పాల్గొన్నారు.



చెత్తకుప్పలను పరిశీలిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న రజకవృత్తిదారుల సంఘం నాయకులు గురుశేఖర్

రజకులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజక వృత్తిదారులకు ఇస్తామన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు, కల్లూర్ మండల కమిటీల సమావేశం జిల్లా కార్యాలయం ఐలమ్మ కార్యాలయంలో కల్లూరు మండల కార్యదర్శి పర్ల. సుంకన్న అధ్యక్షతన నిర్వహించారు. సి.గురుశేఖర్, ఉపాధ్యక్షుడు శేఖర్‌బాబు, కొత్త నగరం అధ్యక్షుడు సి.రాముడు మాట్లాడుతూ ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలు మార్చి 22న కోడుమూరులో నిర్వహిస్తున్నామని, రజక వృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జీవో నంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబాల్లోని యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రజక కార్పొరేషన్‌కు కనీసం1000 (వెయ్యి) కోట్లు కేటాయించి కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రతి రజక కుటుంబానికి రూ.5 లక్షలు రుణాలు ఇవ్వాలని పట్టణ కేంద్రాల్లో నూతన ధోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెంబర్ 6 ప్రకారం కలెక్టర్లు చైర్మన్లుగా రజక సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేసి రజకుల సమస్యల చర్చించాలన్నారు. ఇల్లు లేని రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు కట్టి ఇవ్వాలన్నారు. విశ్వకర్మ కౌసల్య యోజన పథకం ప్రభుత్వ అధికారుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ బాబు మాట్లాడారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కర్నూలు మండలం నాయకులు, వివిధ గ్రామాల రజక వృత్తిదారులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేయడం వల్లే 1956 నవంబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. మహాత్మాగాంధీ ఆశయాల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి అని కొనియాడారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ ఎస్.చిన్నరాముడు, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, ఎంఇ సత్యనారాయణ, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికాసానికి, ఆత్మ స్థైర్యానికి కరాటే

ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేటింగ్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. కర్నూలు శ్రీ బాల శివ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌కు ముఖ్య అతిథులుగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ హాజరయ్యారు. బాలబాలికలకు కరాటే నైపుణ్యాన్ని గుర్తించి వారికి బెల్టులు సర్టిఫికెట్లు అందజేశారు. వేసవికాలంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు టోపీలు బహుకరించారు. ఎగ్జామినర్లుగా గ్రాండ్ మాస్టర్ బి.రాఘవేంద్ర బహదూర్ 9 అంశాలలో విభజించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కరాటే క్రీడాకారులతో డాక్టర్ శంకర్ శర్మ

గర్భధారణలో వచ్చే సమస్యలపై దృష్టి పెట్టాలి

- కామెర్లు, గుండె సమస్యలు, హైబిపి ఇలా ఎన్నో ముప్పులు
- కర్నూలు కిమ్స్ కడల్స్‌లో అత్యాధునిక సదుపాయాలు
- ఫాగ్సి, కిమ్స్ కడల్స్ సదస్సులో వైద్య నిపుణులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గర్భం దాల్చినప్పుడు మహిళలకు అనేక సమస్యలు వస్తాయని, వాటిని ఎప్పటికప్పుడు వైద్యులు గమనిస్తూ తగిన చికిత్సలు అందిస్తే తల్లీ బిడ్డలు పూర్తి క్షేమంగా ఉంటారని వైద్య నిపుణులు చెప్పారు. కర్నూలు కిమ్స్ కడల్స్ ఆస్పత్రి, ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఫాగ్సి) ఆధ్వర్యంలో కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం రాయలసీమలోని వైద్యులకు మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎంఇ) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా గర్భిణులకు వచ్చే పచ్చకామెర్లు, గుండె సమస్యలు, హైబీపీ, మధుమేహం, ఇతర సమస్యలు.. వాటిని గుర్తించి చికిత్స చేసే పద్ధతుల గురించి వివరంగా చర్చించారు. గర్భం దాల్చినప్పటి నుంచి తప్పనిసరిగా ప్రతి నెలా వైద్యుల వద్ద చూపించుకోవాలన్నారు. బీపీ, మధుమేహం, అల్ట్రాసౌండ్ స్కానింగ్ లాంటివి తగిన కాల వ్యవధుల్లో చేయించు కోవాలని నిపుణులు సూచించారు. దానివల్ల తల్లీబిడ్డలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తెలుస్తుందన్నారు. అందుకు అనుగుణంగా తగిన చికిత్సలు చేయడం, ఇతర చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందని వివరించారు. కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది వరకు గైనకాలజిస్టులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కెపి. శిల్ప, కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కె.నవీన్, కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వై.కుసుమ, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.సందీప్ కుమార్, కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ కె. లక్ష్మీప్రసన్న, ఫాగ్సి- 2025 ప్రెసిడెంట్ డాక్టర్ సునీతా తందూల్వాద్కర్, కర్నూలు ఒబిజి సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ వి.రాధాలక్ష్మి, గర్భస్థ శిశు సమస్యల నిపుణురాలు డాక్టర్ కె.నివేదిత, కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.సుధారాణి, కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎస్.జె. జానకిరామ్, కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ హెచ్.ఎ.నవీద్, కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ ఎన్.భారతి, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె. మహమ్మద్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని, వీటితో గర్భస్థ మహిళలతోపాటు వారి కడుపులో ఉండే శిశువులకు వచ్చే ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించవచ్చని డాక్టర్ కెపి.శిల్ప తెలిపారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.మహమ్మద్ ఫారూక్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.సందీప్ కుమార్ మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే వైద్యులు ఎప్పటికప్పుడు ఇలాంటి సదస్సులకు హాజరవడం ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయన్నారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఎన్‌టిఆర్ కాలనీలో రోడ్డు వేయాలి

- 40యేళ్ల క్రితం దెబ్బతిన్న రోడ్డు - పట్టించుకోవడం లేదు- సిపిఎం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో రోడ్డు సౌకర్యం కల్పించాలని 40 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా డ్యామేజ్ అయిందని పాలకులు అధికారులు పట్టించుకోవడంలేదని సిపిఎం పట్టణ నాయకులు టి.రాముడు, కె.కృష్ణ, లక్ష్మీనరసయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టిన సందర్భంగా 40యేళ్ల అయినా రోడ్డు సౌకర్యం లేని ఎన్టీఆర్ కాలనీలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. సిపిఎం పట్టణ నాయకులు బి రాముడు కె.కృష్ణ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ 1984-1985 కీర్తిశేషులు ఎన్.టి.రామారావు సీఎంగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ గారిని పేరు మీద వందల గహాలు కట్టించారని, అప్పుడు వేసిన రోడ్లు ఇంతవరకు రోడ్లు వేయలేదన్నారు. ఇప్పటికీ నాలుగు సార్లు పాలకులు కొత్త రోడ్డు కోసం భూమి పూజ చేశారన్నారు. కానీ మెయిన్ రోడ్డు వేయలేదన్నారు. నాలుగో వార్డు ఆరో వార్డు మధ్యనున్న మెయిన్ రోడ్డును ఎందుకు వేయడం లేదని కాలనీవాసులు పాలక ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వర్షాకాలంలో రోడ్డు మీద వచ్చే నీరంతా మా ఇళ్లలోకి వస్తున్నాయని, దీనివల్ల గృహాలు కుంగిపోతున్నాయని, డ్రైనేజీలు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఎన్నికల సభల్లో మా ప్రభుత్వం వస్తే ఎన్టీఆర్ కాలనీ నందనవనం చేస్తాం హామీలు ఇచ్చినప్పటికీ నేటికీ టిడిపి ప్రభుత్వం 9 నెలలు కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇంటి నెంబర్ 9/992 నుండి 9/1164 లైన్ మొత్తం 9/1238 నుండి 9/1146 నుండి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు సురేష్, కె.కృష్ణ స్థానిక నాయకులు పి. మహమ్మద్, బర్మోజీ, నర్సోజి, నరసింహులు, మోహిన్, ఆటో బాష, ఖాజా, వీరేష్, ఆటో లింగమూర్తి గౌస్‌పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్‌కాలనీలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డును చూపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

మంత్రాలయం: ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, సిపిఎం మండల కన్వీనర్ తిక్కన్న పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర మండల పరిధిలోని చిన్నతుంభళం, బాపురం, కల్లుకుంట గ్రామాల్లో కొనసాగింది. యాత్రలో భాగంగా గ్రామాల్లో పలు కాలనీల్లో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుకొని మాట్లాడారు. గ్రామాల్లో సరైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శిం చారు. తాగునీటి నీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని, పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవు తాయని తెలిపారు. సిపిఎం నాయకులు హనుమంతు, దేవదాసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడుబూరులో సిపిఎం నాయకుల ప్రజాచైతన్య యాత్ర

కురుకుందలో తాగునీటి సమస్య తీర్చండి : సిపిఎం

ప్రజాశక్తి -ఆలూరు

మండలంలోని కురుకుంద గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి. హనుమంతు, ఈరన్న డిమాండ్ చేశారు. ఆదివారం కురుకుంద గ్రామంలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కురుకుంద గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం కటకట లాడుతున్నారన్నారు. బిందెడు మంచినీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి దుస్థితి ఉందని అన్నారు. 15 రోజులకు ఒకసారి వచ్చే నీళ్లు కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితంగా వస్తున్నాయని, దళిత, బీసీ కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని వారన్నారు. గ్రామంలో చెడిపోయిన బోరింగులను వెంటనే మరమ్మతులు చేయాలని, సంపులోని నీటిని ఆరు నెలలైనా శుభ్రం చేయకపోవడంతో సంపులో దుమ్ము ధూళి వండ్రు చేరుకొని తాగడానికి పనికిరాకుండా ఉన్నాయన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి సంపులు క్లీన్ చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. రానున్న ఏప్రిల్, మే నెలలలో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉందని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఉరుకుంద గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉరుకుంద గ్రామంలో నీటి సమస్య పరిష్కరించకపోతే గ్రామంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అల్లప్ప,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి పేర్కొన్నారు. హలహర్వి మండలం వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే విరుపాక్షిని ఆదివారం కలిసి శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని మల్లికార్జునపల్లె వైయస్సార్ పార్టీ నాయకుడు హుస్సేన్‌కి మండల కో-కన్వీనర్ (ఉపాధ్యక్షుడు) ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి పని చేస్తామని పల్లె హుస్సేన్ తెలిపారు. ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డితో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను పక్కనపెట్టి ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో జయరాముడు, ఈరప్ప, రాజు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని సన్మానిస్తున్న కార్యకర్తలు

బావిలో గుర్తు తెలియని మహిళ శవం

ప్రజాశక్తి - ఆస్పరి

మండల కేంద్రమైన ఆస్పరిలోని స్థానిక పెద్ద బావిలో గుర్తు తెలియని మహిళ శవం ఆదివారం లభ్యం అయ్యింది. ప్రజలంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బావిలోని నీరు గ్రామస్తులు కొన్ని దశాబ్దాలుగా తాగుతుండే వారు. కొత్తగా పెళ్లయిన దంపతులు ఈ బావిలోని గంగ నీరు ఇప్పటికీ తీసుకెళ్తారు. అలాంటి బావిలో గుర్తు తెలియని శవం ఉండడంతో గ్రామస్తులు భాగోద్వేగానికి గురయ్యారు. సిఐ మస్తాన్ వలి వివరాల మేరకు.. ఆస్పరి పెద్దబావిలో గుర్తు తెలియని మహిళ శవం పడి ఉందని సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించామన్నారు. మహిళ ఒంటిపై ఎర్రటి పంజాబ్ డ్రస్, చేతికి గాజులు, కాళ్లకు పట్టీలు ఉన్నాయన్నారు. వయసు దాదాపు 35 నుండి 40ఏళ్లు ఉండొచ్చన్నారు. మహిళను హత్య చేసి బావిలో పడేశారా? ఆత్మహత్య చేసుకుందా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కి తరలించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సిఐ తెలిపారు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఆదోని

ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇంజనీరు ఇంతియాజ్ రెవిన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారన్నారు. అలాంటి మహనీయుని ప్రాణ త్యాగం ఫలితమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందన్నారు. మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని కొనియాడారు. ఉద్యోగులు నరసింహులు, పావని, ముని ,వలి, కరెప్ప వున్నారు.

గూడూరు: ఆంధ్రావతారణ పితామహులు పొట్టిశ్రీరాములు 124వ జయంతిని ఎమ్మార్పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పి జాతీయ నాయకులు రమణ, రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, టిడిపి రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి షకీల్ అహమ్మద్ పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. వారు మాట్లాడుతూ అప్పటి మద్రాస్ రాష్ట్రం ఉన్న సమయంలో తెలుగు వారు పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూసిన పొట్టిశ్రీరాములు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా ప్రచార కార్యదర్శి కట్టెల రాజు, ఎమ్మార్పిఎస్ మండల నాయకులు నాగేష్, అశోక్, షేక్ చాంద్ బాష పాల్గొన్నారు.


ఆదోని లోపొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ అధికారులు

పన్ను చెల్లించలేదని నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఆదోని

సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం ప్రాపర్టీ టాక్స్ చెల్లించాలని సచివాలయ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఆఫీసర్ మాట్లాడారు. ఆదోని పట్టణంలో సకాలంలో టాక్స్ చెల్లించని వారిని గుర్తించామన్నారు. ఆయా వార్డుల్లో ఇప్పటికే 300 మందిని గుర్తించి టాక్స్ చెల్లించని కారణంగా నీటి సరఫరా నిలిపివేశామన్నారు. 500 మంది మొండి బకాయి దారులను గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. ప్రతి నెల మూడు నెలలకు ఒకసారి ట్యాక్స్ చెల్లించుకునే అవకాశం ఉన్నప్పటికీ చాలామంది మార్చి నెలలోనే చెల్లించాలన్నారు. ఈ ఏడాది తొమ్మిది కోట్లు టాక్స్ వసలు చేశామని మొత్తానికి 13 కోట్లు వసూలు కావలసి ఉందన్నారు. ప్రాపర్టీ వాటర్ ట్యాక్స్ కలిపి వసూలు చేసేందుకు ప్రణాళిక పెట్టుకున్నామన్నారు. శరాప్ బజార్, కోడల్‌పేట షాపింగ్ మాల్, నివాస ప్రాంతాలలో తిరుగుతూ ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామన్నారు.

11 బృందాలుగా ఏర్పడి టాక్స్ వసూలు చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు ఈనెల చివరిలోగా టాక్స్ చెల్లించి పట్టణ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్, షేక్షావలి సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

డివైఎఫ్ఐ కృషితో వైన్ షాపు మార్పు

ప్రజాశక్తి-ఆదోని :డివైఎఫ్ఐ కృషివల్లనే అధికారులు స్పందించి దీప్తి న్యూవైన్ షాపును మరోచోటకు తరలించారని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ నాయకులు వెంకటేష్, మోహన్ తెలిపారు. ఆదివారం మూతేసిన వైన్ షాప్ ముందు మాట్లాడారు. ఆదోని పట్టణం కొత్త బస్టాండ్ రోడ్ సుంకులమ్మ దేవాలయం పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన న్యూదీప్తి వైన్ షాపును తొలగించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషకు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఎక్సైజ్ సీఐ సైదులు కు ప్రజలతో సేకరించిన సంతకాల అర్జీలను డివైఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్చామన్నారు. దేవాలయము, మసీదు,స్కూలు, దగ్గరలో వైన్ షాప్ ఏర్పాటు చేయడంతో అక్కడి కాలనీవాసులు, భక్తులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైన్ షాపును వెంటనే తొలగించాలని కర్నూలులో జరిగిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అర్జీ ఇవ్వడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న దీప్తి న్యూ వైన్ షాప్‌ను అక్కడి నుంచి తొలగించి మార్పు చేశారన్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్ ,సబ్ కలెక్టర్, ఎక్సైజ్ సిఐకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నేటినుంచి పది పరీక్షలు ప్రారంభం

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో మూడు సెంటర్లలో పదవ తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంత తెలిపారు. ఆదివారం వరకు విలేకరులతో మాట్లాడుతూ గోనెగండ్లలోని ఏపి మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల మూడు కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని ఈ కేంద్రాలలో మొత్తం 623 మంది రెగ్యులర్ , 91 మంది విద్యార్థులు కంపార్ట్‌మెంటల్‌గా పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు అవసరమైన డెస్కులు, ఫ్యాన్లు, తాగునీటితోపాటు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తక్షణం స్పందించే విధంగా ఆరోగ్య కార్యకర్తలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్-ఎస్163 యాక్టు అమలులో ఉంటున్నందున అనవసరంగా ఎవరు పరీక్షా కేంద్రాల వద్ద తిరగరాదని అన్నారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పరీక్షలు రాసేప్పుడు వత్తిడికి లోను కావద్దు

ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి-చిప్పగిరి



నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులందరూ కూడా ఒత్తడికి లోను కావద్దని విద్యాధికారి సావిత్రమ్మ విద్యార్థులకు సూచించారు. ఆదివారం ఎంఆర్‌సి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చిప్పగిరిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం పదవ తరగతి పరీక్ష రాసే బాలికలు బాలురతో కలిపి 387 మంది ఉన్నారన్నారు. ప్రైవేటు విద్యార్థులు 75 మంది, ఒకేషనల్ విద్యార్థులు 88 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. ఫాతిమా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 239 మంది విద్యార్థులు, ప్రైవేట్ విద్యార్థులు 75 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 148 మంది విద్యార్థులు , ఒకేషనల్ కు చెందిన 88 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు.


పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- దేవనకొండ

పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేవనకొండ మండలంలో 4 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు, రెగ్యులర్ తెర్నేకల్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఏ సెంటర్లో 270, బి సెంటర్లో 270, దేవనకొండ హై స్కూల్లో 328, కెజిబివి లో121 మంది మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కావలసి ఉందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే సెంటర్లలో బెంచీలు, విద్యుత్ ,తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు.

ఘనంగా శ్రీ సుధీంద్ర తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి-మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభు దేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి గురువైన శ్రీసుధీంద్ర తీర్థుల ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని నవ బృందావన గడ్డలో ఉన్న శ్రీ సుధీంద్ర తీర్థుల ఆరాధనను పురస్కరించుకుని శ్రీసుధీంద్ర తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం శ్రీ సుధీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. శ్రీ వ్యాసరాజ మఠంలోని శ్రీ విద్యాశీశా తీర్థులు , శ్రీ శ్రీపాదరాజ మఠంలోని శ్రీ సుజయనిధి తీర్థ స్వామీజీతో పాటు శ్రీ ప్రాణదేవుడికి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీకర్ సెక్షన్ కాలనీలో శిథిలమైన సిసి రోడ్లు

డ్రెయినేజీలు నిర్మించాలి

ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలుహాస్పిటల్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్,వార్డు కార్యదర్శులు నాయకులు ఎస్. శ్యామల, ఎస్.రహిమాన్, ఎం.జమ్మన్న, అబ్దుల్లా, గుర్రప్ప, అనసూయ, మమతలతో కలిసి వీకర్ సెక్షన్ కాలనీ, సూర్యనారాయణ నగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కాలువల సమస్య, శిథిలమైపోయిన సీసీ రోడ్ల సమస్య రోజు రోజుకు పెరిగిపోతున్న కరెంటు చార్జీల సమస్యలు ప్రజలు సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. వారు మాట్లాడుతూ వీకర్ సెక్షన్ కాలనీలో బడుగు బలహీన వర్గాల ప్రజలు రోజువారు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కాలనీలో రోడ్డు డ్రైనేజీ కాలువలు శిథిలమైనా అధికారులు,ప్రజాప్రతినిధులు ,పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఎక్కడ కాలువలు అక్కడ నిలబడిపోయి, నీరు నిలువ ఉండి దోమలు, దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, పేద ప్రజలు నివసిస్తున్న ఈ కాలనీపై ప్రత్యేక దృష్టి పాలకులకు లేదన్నారు. శిథిలం అయిపోయా సీసీ రోడ్లను డ్రైనేజీ కాలువలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.


సిపిఎం నాయకులకు పాడయిన రోడ్డును చూపుతున్న స్థానికులు

వాసవీ మాతకు వెండి విరాళం



ప్రజాశక్తి - ఆదోని రూరల్

పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వాసవీ కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ వారు 300 గ్రాముల వెండిని ఆదివారం విరాళంగా అందజేశారు. శ్రీకన్యకాపరమేశ్వరి ట్రస్ట్ ప్రెసిడెంట్ రాచోటి రఘురాం, సెక్రెటరీ గొంది పద్మనాభయ్యలు మాట్లాడుతూ వాసవీ మాత దీవెనలు ప్రజలకు ఎల్లపుడూ ఉండలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీ సంఘం ప్రెసిడెంట్ కెటిజి. శ్రీనివాస్, సెక్రెటరీ కొట్రా వేణు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-కౌతాళం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కుంటనహాళ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టిడిపి మైనార్టీ నాయకుడు రఫిక్ ఇంట్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ శనివారం రాత్రి జరగడంతో ఇంట్లో ఉన్న విలువైన సామాగ్రితో పాటు రూ.80 వేలు కాళీ బూడిద అయ్యాయి. ఘటన జరిగిన రాత్రి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని అన్నారు. ఆ సమయంలో ఇంట్లో వారందరూ కర్ణాటకలోని సిరుగుప్పకు వెళ్లారన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఏర్పడిన మంటలను చుట్టుపక్కల వారు స్పందించి తలుపులు బద్దలు కొట్టి మంటలు ఆర్పడంతో గ్యాస్ సిలెండర్ పేలలేదన వివరించారు.



బాధితుడు రఫిక్ మాట్లాడుతూ ఫ్రిడ్జ్, టీవీ, విలువైన ఇంటి పత్రాలు, రూ.80వేల నగదు అన్ని కాలిపోయాయన్నారు. సుమారు రూ.3.5లక్షల నష్టం జరిగిందన్నారు.

సాగునీరు అందించండి

ప్రజాశక్తి-కోసిగి

మండల పరిధిలోని చిర్తనకల్ గ్రామ రైతులకు సాగునీరు అందించాలని సిపిఎం మండల నాయకులు రాముడు , వీరేష్ కోరారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం చిర్తనకల్ గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ మూగులదొడ్డి చెరువు నుండి రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, ఇక్కడ రైతులు కేవలం వర్షం మీద ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారన్నారు. కూలీలకు పనులు లేక వలసలు పోతున్నారని వారు ప్రజా చైతన్యత దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం వెంటనే చేపట్టి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించి వలసలు ఆపాలని కోరారు. సిసి రోడ్లు డ్రైనేజీలు సౌకర్యాలు కల్పించాలని వివిధ వర్గాల వారికి పించన్ సౌకర్యం కల్పించాలనన్నారు. గ్రామ రైతులు నాగిరెడ్డి , ఆంజనేయులు , ఈరన్న , లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ను ఢీకొట్టిన బొలెరో- ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - సి బెళగల్

బెళగల్‌కు చెందిన రవి బ్రాహ్మణ దొడ్డి కుంట దగ్గర చేపలు తీసుకోని వస్తుండగా బురాన్‌దొడ్డికి చెందిన వాసు బొలెరో బైక్‌ను ఢీకొట్టింది. అతి వేగం కారణంగా రవి అనే వ్యక్తి కాళ్లకు, నడుముకు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు వెంటనే సమాచారం అందుకొని గాయాలైన వ్యక్తిని వైద్యం నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహారాజ శ్రీ కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఇ.ఎ. నెం. 35/2024, ఇ.పి. నెం. 35/2019
ఇన్ ఓ.ఎస్. నెం. 154/2012

కాటి గారి వెంకటేశ్వర్లు వగైరా. ...అర్జీదారులు

వర్సెస్

వెంకటేశ్వర్లు గౌడ్ వగైరా. ...రెస్పాండెంట్లు

3,5,6 రెస్పాండెంట్లకు O 21 R-106 ప్రకారం నోటీసులు

R3: మధు తండ్రి తెలీదు, గీతా ముఖర్జీ నగర్, సంతోష్ నగర్ వెనుక, ఎన్.హెచ్-7 రోడ్డు, కర్నూలు. **R4:** బిర్రు ప్రతాపరెడ్డి తండ్రి తెలీదు, ఇంటి నెంబర్ 7-6-2(1), సాయిబాబా దేవాలయం దగ్గర, బాలాజీ నగర్, న్యూ పోస్టల్ కాలనీ, కర్నూలు.
R6: వెంకటేశ్వర రెడ్డి తండ్రి తెలీదు, ట్రాక్టర్ ఓనర్, బాబా బృందావన్ నగర్, బళ్లారి చౌరస్తా, కర్నూలు.

పై నెంబర్ ఇ.పి.లో డి.హెచ్.ఆర్ ఇ.పి. షెడ్యూల్ ఆస్తిని ఖాలి చేయించి అందు కట్టబడిన అక్రమ కట్టడములు తీసి వేయించి తన స్వాధీనం చేయమని అమలు అర్జీ దాఖలు చేసినాడు. సదరు అమలు అర్జీని కోర్టు వారు 29-02-2024వ తేదీన డిఫాల్ట్ క్రింద తోసి వేసినారు. సదరు డిఫాల్టును రద్దుచేసి అమలు అర్జీని తిరిగి ఫైల్ లోకి తీసుకోమని అర్జీదారులు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 3,5,6 రెస్పాండెంట్లు అయిన మీకు అక్షేపణలు ఉన్న యెడల 26-03-2025వ తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

జె. లక్ష్మి నారాయణ,
అర్జీదారుల పరం అడ్వకేట్,
కర్నూలు.

ఆర్డర్ 38 రూల్ 8 and సెక్షన్ 151 క్లెయిమ్ నోటీస్ ప్రకటన
మహా రాజశ్రీ ఆడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు : కర్నూల్
I.A NO.304/2024 IN I.A.NO.27/2023.
IN O.S.No 2/2023

1. శ్రీమతి ఎ. భారతి
2. శ్రీమతి ఎ. గీత దేవి.
3. శ్రీమతి ఎ. నాగమణి
4. శ్రీమతి ఎ. నాగేశ్వరి. ...అర్జీదారులు

V/s

1.ఎ.సాయి అన్వేష్ (పిటిషనర్) (వాది) వగైరా
మూడవ రెస్పాండెంట్: ఆవుల వెంకట కృష్ణ,
తండ్రి రామ సుబ్బయ్య @ పెద్ద రామ సుబ్బయ్య,
సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఇ.నెం.87-1201-2-సి-8, సోమిశెట్టి నగర్, కర్నూల్
(రెండవ డిఫెండెంట్)
ప్రజెంట్ అడ్రసు: ఆవుల వెంకట కృష్ణ,
తండ్రి రామ సుబ్బయ్య @ పెద్ద రామ సుబ్బయ్య,
సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఇంటి నెం.12-02-67,
హరిహర దేవస్థానం దగ్గర, ఇండోర్ స్టేడియం ఎదురుగా, అశోక్ నగర్, అనంతపూర్.
(లేక)
ఆవులు వెంకట కృష్ణ, తండ్రి రామ సుబ్బయ్య @ పెద్ద రామ సుబ్బయ్య, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్.పి.బంగ్లా, అనంతపూర్. ...Respondents

సదరు ఆర్టీలో ఒకటి నుంచి నాలుగు ఆర్జిదారులు, ఒకటి నుంచి నాలుగు respondents పైన ఆర్డర్ 38 రూల్ 8 ప్రకారము ఆర్జీ దారులకు పిటిషన్ ఎడ్యూల్ దాఖల ఆస్తిలో అర్జీదారులు అయిన మాకు కూడా హక్కు ఉంటుందని ఐ.ఎ.304/2004 క్లెయిమ్ పిటిషన్ అర్జీ దాఖలు చేసుకోని ఉంటున్నారు. మూడవ respondent క్లెయిమ్ పిటిషన్ నోటీస్ కు గాను 01-04-2025 వ తేదీన వాయిదా వేసినారు. మూడవ respondens కు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ఉదయం 10.30 గంటలకు పై కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనంతట పరోక్షముగా తీర్మానింపబడును.
వాయిదా తేది :01-04-2015

శ్రీ వి.రామచంద్రరావు గారు,
ఆర్జీదారుల అడ్వకేటు,
నంద్యాల.